డివిజన్ అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే

నల్లకుంట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన ప్రథమ ధ్యేయమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. నల్లకుంట డివిజన్‌లోని బ్రాహ్మణ హాస్టల్ వీధిలో రూ.86 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ యాకర అమృతతో కలిసి ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నల్లకుంట డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో సుమారు రూ.8 కోట్ల వ్యయంతో నూతన డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం, పార్కుల సుందరీకరణ పనులు చేపడతామని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజాభిప్రాయం మేరకు పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు ప్రసాద్, సీనియర్ నాయకులు విజయేంద్రసాగర్, ప్రదీప్‌రావు, నరేందర్, మోహన్, కిషన్‌రావు, శ్రీధర్, సతీష్, మహిళా నాయకురాలు రమ్య, లావణ్య, రత్నమాల, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

నీరు నిల్వ లేకుండా చూడాలి

● జీహెచ్ఎంసీ డిప్యూటీ డీఈఓ శ్రవణ్‌కుమార్

కవాడిగూడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు నీరు నిల్వ లేకుండా చూడాలని డిప్యూటీ డీఈఓ శ్రవణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. కవాడిగూడ ప్రభుత్వ పాఠశాలలో పరిసరాల శుభ్రత, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ రామానుజాలరెడ్డి, ఏఎంవోహెచ్ డాక్టర్ ప్రవీణ, డీబీఆర్ మిల్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అవంతి, ఎంటమాలజీ సీనియర్ అధికారి దుర్గాప్రసాద్, సూపర్‌వైజర్ రసూల్, పాఠశాల హెచ్ఎం మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ శ్రవణ్‌కుమార్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. గోల్నాక పరిధిలో ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు, బ్రాహ్మణ హాస్టల్ పరిధిలో 11.30 నుంచి 12.30 వరకు, ప్లేగ్రౌండ్ పరిధిలో 11.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సీఈ కాలనీ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ఎన్టీఆర్‌కు అత్యంత ఆత్మీయుడు సినారె

● ఎమ్మెల్సీ మధుసూదనాచారి

చిక్కడపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మారుమూల పల్లె నుంచి తన అక్షరశక్తితో ఎదిగి కేంద్రం నుంచి పద్మవిభూషణ్‌గా గౌరవింపబడిన సినారె ఎన్టీఆర్‌కు అత్యంత ఆత్మీయుడని శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం డా. సి.నారాయణరెడ్డి యాదిలో పేరిట ఆయన జయంతి సమావేశాన్ని గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినారె ఎన్టీఆర్‌కు తొలిసారిగా పాట రాసి సినీ రంగ ప్రవేశం చేశారని గుర్తు చేశారు. విశ్వంభర కావ్యంతో జ్ఞానపీఠ్ అవార్డు అందుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సాహితీవేత్త జయరాములు, గాయకుడు బాలాజీ, రవిచందర్, కుమార్, ఓంకార్‌రాజు, నరేందర్‌గౌడ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చిక్కడపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంటమాలజీ సిబ్బంది ప్రజలకు సూచించారు. గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది శుక్రవారం మందు స్ప్రే చేశారు. మలేరియా, డెంగీ తదితర విషజ్వరాలు రాకుండా ఉండేందుకు బస్తీల్లో మందు స్ప్రే చేస్తున్నట్టు చెప్పారు. బస్తీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ఎంటమాజీ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే టీబీ నిర్మూలన: యాకర అమృత


మాట్లాడుతున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే టీబీ వ్యాధి నిర్మూలన సాధ్యమని నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత తెలిపారు. టీబీ వ్యాధిపై ప్రజలలో అవగాహన పెంపొందించడానికి డివిజన్ పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు అమృత తెలిపారు. తిలక్‌నగర్ యూపీహెచ్‌సీలో జేఏఎస్, జన ఆరోగ్య సమితి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, టీబీ వ్యాధిగ్రస్థులు సకాలంలో మందులు తీసుకోకపోవడంతోనే మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీబీ శిబిరాలు రోగులకు ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. ఎస్‌పీహెచ్‌వో డాక్టర్ పద్మజ, డాక్టర్ దీప్తి, బీజేపీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్‌జోషి, పార్టీ నాయకుడు మధుసూదన్‌యాదవ్ పాల్గొన్నారు.

నూతన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు: ఉమాదేవి

బర్కత్‌పుర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో నూతన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించినట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. డివిజన్‌లోని జమల్‌బస్తీ, మణియార్‌పట్టి, కుత్బీగూడ, బండలబస్తీ, భూమన్నగల్లీ, షాలినీ ఆస్పత్రి వీధి తదితర ప్రాంతాలలో శుక్రవారం కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని అధ్వానంగా ఉన్న రోడ్లను పరిశీలించారు. అన్ని బస్తీలలో సీసీ రోడ్లు నిర్మించడానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ప్రశాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేశ్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌యాదవ్, నాయకులు మల్లికార్జున్, భీమ్‌రాజ్, సంతోష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేస్తున్న ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్

సేవా గుణం అలవరచుకోవాలి

● ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

కవాడిగూడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవరచుకోవాలని ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ సూచించారు. అప్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దోమలగూడలోని భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత నోటు బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమేశ్ మాట్లాడుతూ, ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు ఆయన సూచించారు. విద్యార్థులకు అప్సా స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు అమోఘమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి కొనియాడారు. బీజేపీ నాయకులు చిత్రకుమార్‌గౌడ్, అప్సా కో ఆర్డినేటర్ రమేశ్, సంస్థ ప్రతినిధులు శ్రావణి, లావణ్య, సికింద్రాబాద్ పీజీ కళాశాల విద్యార్థులు డానియల్, సౌమ్య, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఆటోల విక్రయం: అమానుల్లాఖాన్

నల్లకుంట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆటో షోరూం డీలర్లు ఫైనాన్షియర్లతో కుమ్మక్కై బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని షేక్ హ్యాండ్ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ ఆరోపించారు. ఆటో బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 14న నగరంలో ఆటోబంద్ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆటో బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న వారిపై పీడీయాక్ట్ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ జేఏసీ నేతలు సలీం, యాహియా, లతీఫ్, హస్మీ పాల్గొన్నారు.

రైతు రుణాలు మొత్తం మాఫీ చేయాలి

● అఖిల భారత విప్లవ రైతు సంఘం నేతలు


మాట్లాడుతున్న శంకర్

రాంనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైతు రుణాలు మొత్తం మాఫీ చేయాలని అఖిల భారత విప్లవ రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత విప్లవ రైతు సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐకేఎస్ జాతీయ సమన్వయకర్త శంకర్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో నేడు వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను ఎందుకు అమలు చేయడం లేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల నర్సింహ, సంఘం నాయకులు శంకర్, మానసయ్య, సోరాయాదవ్, వెంకట్‌రెడ్డి, రాజన్న పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శిగా సల్లాఉద్దీన్

ముషీరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ముషీరాబాద్ విద్యా మండలి నూతన కార్యదర్శిగా కవాడిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సల్లాఉద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం సల్లాఉద్దీన్‌కు ముషీరాబాద్ డిప్యూటీ డీఈవో శ్రవణ్‌కుమార్ ఎస్‌టీయూ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారావులు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సల్లాఉద్దీన్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడారంగంలో రాణించేలా కృషి చేస్తానని చెప్పారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి: పావని

చిక్కడపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న వర్షాలతో గాంధీనగర్ డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాల్లో వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, జీహెచ్ఎంసీ డీఈఈ గీత, ఏఈ అబ్దుల్‌సలామ్‌తో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ అప్రమత్తంగా ఉండాలని, సమస్యాత్మక ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, నవీన్ కుమార్, సాయిచంద్, వీఏస్టీ రాజు, ఉమేష్, ఆనంద్ పాల్గొన్నారు.

మహాకాళి ఆలయ ఆదాయం రూ.71వేలు

ముషీరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని మహాకాళి దేవాలయ హుండీని ఆలయ ఈఓ మహేందర్ కుమార్, ఇన్‌స్పెక్టర్ అండాలు పర్యవేక్షణలో శుక్రవారం అధికారులు లెక్కించారు. మూడు నెలలకు గాను హుండీ ఆదాయం రూ.71వేలు వచ్చినట్టు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు చంద్రమౌళి, బీజేపీ నాయకులు బాలరాజుయాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తేజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


శ్మశానవాటికను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ వెంకట్

ముస్లిం శ్మశానవాటిక పరిశీలన

అంబర్‌పేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలో నిర్మాణంలో ఉన్న ముస్లిం శ్మశానవాటిక పనులను ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ శుక్రవారం కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. శ్మశాన వాటిక పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, జీహెచ్ఎంసీ డీఎంసీ మారుతిదివాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ కృషి

చిక్కడపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ కృషి చేస్తుందని అఖిల భారతీయ రేకా మజ్దూర్ మహాసంఘ్ (ఏబీటీఎంఎంఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కంది శ్రీనివాస్, సచిన్ మేంగాలే అన్నారు. ఢిల్లీలో బీఎంఎస్ 70వ వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని బీఎంఎస్ రాష్ట్ర కార్యాలయం వద్ద వారు మాట్లాడారు. ప్రపంచ కార్మిక ఉద్యమానికి దిశా నిర్దేశం చేయడం బీఎంఎస్ బాధ్యతగా మారిందని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లపై కేంద్ర కార్మిక మంత్రితో త్వరలో చర్చలు జరుపుతామని వారు తెలిపారు.


లైబ్రరీ కార్యదర్శి పద్మజకు పుస్తకాన్ని అందజేస్తున్న అందెశ్రీ

ఎల్లమ్మ ఆలయంలో అందెశ్రీ పూజలు

చిక్కడపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీ ఆవరణలో ఉన్న రేణుకా ఎల్లమ్మను తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లైబ్రరీ కార్యదర్శి పొట్లూరు పద్మజ అందెశ్రీని సన్మానించారు. వాక్కులమ్మ ప్రచురణలకు సంబంధించిన రెండు పుస్తకాలను పద్మజకు అందెశ్రీ అందజేశారు. ఆలయ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.


మంత్రి లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు పాస్టర్ల సన్మానం

చిక్కడపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను పలువురు పాస్టర్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో మంత్రి లక్ష్మణ్‌ను పలువురు పాస్టర్లు కలిసి సన్మానించారు. క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్, బరియల్ గ్రౌండ్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్, ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనోష్‌కుమార్, టీయూసీపీఏ కోశాధికారి బెనోనిరిచర్డ్, ఏఐసీసీ కార్యదర్శి బాలరాజు, డేవిడ్‌రాజు, మేషక్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

అంబర్‌పేట: పరిసరాల పరిశుభ్రత పాటించాలని కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ విద్యార్థులకు సూచించారు. డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంబర్‌పేటలోని సీసీఎల్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం కార్పొరేటర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంబర్‌పేట డీఎంసీ మారుతిదివాకర్, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, పాఠశాల హెచ్ఎం సుశీలమ్మ, జీహెచ్ఎంసీ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకుడు మహేష్ పాల్గొన్నారు.

పుస్తకం అందజేత



నల్లకుంట కూరగాయల మార్కెట్‌లోని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు నివాసానికి శుక్రవారం హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వచ్చారు. ఈ సందర్భంగా తాను రాసిన ఆత్మకథ పుస్తకాన్ని కృష్ణమోహనరావుకు అందజేశారు. అనంతరం దత్తాత్రేయను కృష్ణమోహన్‌రావు దంపతులు శాలువాతో సత్కరించారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి

బహుజన సమాజానికి ప్రభంజన్ మృతి తీరని లోటు

రాంనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీసీల హక్కుల సాధన కోసం కృషి చేసిన ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్ మరణం బహుజన సమాజానికి తీరని లోటని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా నల్లా సూర్యప్రకాష్, ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి రవి, నాయకుడు రాములు దివంగత ప్రభంజన్ యాదవ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పర్వతాలు, వెంకటస్వామి, శంకర్, సుకన్య, కళావతి, దానయ్య, సునీల్, గోపాల్, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి యజమానికి నోటీసులు

రాంనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా నల్లకుంటలో భవనాన్ని నిర్మిస్తున్న ఇంటిని అధికారులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా భవన యజమనిఇకి 461 (ఎ) ఆఫ్ హెచ్ఎంసీ యాక్ట్ 1955 కింద నోటీసులు అందజేశారు.

ముషీరాబాద్‌లో ముసురు

● ఇబ్బందులు పడ్డ విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు

ముషీరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి చిరు జల్లులు పడడంతో ముషీరాబాద్‌లోని విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. దాయార మార్కెట్ నుంచి సాగర్‌లాల్ ఆస్పత్రి చౌరస్తా వరకు రోడ్డంతా గుంతలమయంగా మారడం.. వర్షం నీరు నిలవడంతో రాకపోకలకు తీవ్రమైన అంతరాయం ఏర్పడింది. రోడ్డంతా బురదమయం కావడంతో పాదచారులు నడవలేని పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి గుంతలమయమైన రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


సాగర్‌లాల్ ఆస్పత్రి చౌరస్తాలో రోడ్లపై నిలిచిన వర్షం నీరు

అనుమతి లేని సెల్ టవర్లను తొలగించండి

● సీపీఎం నేతల డిమాండ్

రాంనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో అనుమతి లేని సెల్ టవర్లను తొలగించాలని సీపీఎం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోల్కొండ చౌరస్తాలోని సీపీఎం నగర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం నగర కార్యదర్శి వెంకటేష్, సిటీ కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాస్, వెంకటేష్‌లు మాట్లాడారు. దశాబ్ద కాలంగా సెల్ టవర్ కంపెనీల ఇష్టారాజ్యం కొనసాగుతోందని ఆరోపించారు. అనుమతి లేని సెల్ టవర్లను కొనసాగించడంపై విచారణ జరపాలని, ఫీజులు, ఆస్తి పన్ను పూర్తి స్థాయిలో వసూలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌ఓ డా.వెంకటి

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి : డీఎంహెచ్‌ఓ

ముషీరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గర్భిణీలు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. వెంకటి సూచించారు. ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మిడ్ టౌన్ సంస్థ ఆధ్వర్యంలో తల్లి, పిల్లల ఆరోగ్య సంరక్షణపై వైద్య శిబ్బందికి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటి మాట్లాడుతూ, తల్లిపాలు పిల్లలకు శ్రేయస్కరమని. చిన్న పిల్లలకు తప్పనిసరిగా తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. ఆశా, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి గర్భిణీ, బాలింతలను గుర్తించి వారి ఆరోగ్య సలహాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.పద్మజ, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా.మనోజ్‌రెడ్డి, వైద్యులు ధనశ్రీ నాయుడు, సునీత, వైజయంతి, అనిత, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మిడ్ టౌన్ అధ్యక్షుడు హజీర్, కార్యదర్శి చంద్రశేఖర్, ప్రతినిధులు నీలా, సీమకుమార్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

కవాడిగూడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన దోమలగూడ పీఎస్ పరిధిలోని ట్యాంక్‌బండ్‌పై జరిగింది. ఏఎస్ఐ చెలమయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లలో నివాసం ఉండే శ్రీనివాస్ (50)కు మతిస్థిమితం సరిగా లేదు. చికిత్స నిమిత్తం ఆయన కుమారుడు ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి తీసుకువస్తుండగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న వేమన విగ్రహం వద్ద కుటుంబ సభ్యులకు చెప్పకుండా శ్రీనివాస్ తప్పిపోయాడు. అతని కోసం కుటుంబ సభ్యులు ఎంతవెతికినా శ్రీనివాస్ ఆచూకీ లభించలేదు. తండ్రి మిస్సింగ్‌పై ఆయన కుమారుడు దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ చెలమయ్య తెలిపారు. శ్రీనివాస్ ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పీఎస్‌లో గాని, 8712568855కు సమాచారం అందించాలని ఏఎస్ఐ తెలిపారు.

విద్యుత్ వైర్ల దొంగల అరెస్ట్

అంబర్‌పేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలో నిర్మాణంలో ఉన్న ఇంటి నుంచి విద్యుత్ వైర్లను దొంగిలించిన నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఐ హబీబుద్దీన్ తెలిపారు. అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌కు చెందిన సాయి నిఖిల్ గౌడ్, వడ్డెర బస్తీకి చెందిన భూపేష్ స్నేహితులు. జల్సాలకు అలవాటు పడిన వారు సులువుగా డబ్బులు సంపాదించడానికి నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ప్రేమ్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంతియాజ్ ఇంటి నుంచి విద్యుత్ వైర్లను ఈ నెల 22న మైనర్ బాలునితో కలిసి చోరీ చేశారు. విద్యుత్ వైర్లను కాల్చి వాటి నుంచి వచ్చిన రాగిని అమ్ముకుని జల్సాలు చేశారు. శుక్రవారం ఉదయం అలీకేఫ్ చౌరస్తాలో తచ్చాడుతున్న వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు చేసిన నేరం అంగీకరించారు. నిందితులను రిమాండ్‌కు తరలించగా మైనర్ బాలున్ని జువెనైల్ హోమ్‌కు తరలించినట్లు డీఐ తెలిపారు.

రైలు ప్రయాణికుడి అదృశ్యం

బర్కత్‌పుర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుడు అదృశ్యమయ్యాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల్ ఐజా మండలానికి చెందిన మౌలాసాబ్ (42) వృత్తి రీత్యా బైక్ మెకానిక్. నగరానికి వచ్చి రాజు వద్ద బైక్ మెకానిక్‌గా చేరాడు. మౌలాసాబ్ సరిగా పనిచేయక పోవడంతో ఇంటికి వెళ్లాలని రాజు చెప్పాడు. స్నేహితుడు బోయ సత్యం మౌలాసాబ్‌ను వెంట తీసుకుని ఈ నెల 17న ఉదయం 7 గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చి తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కించాడు. మౌలాసాబ్ గద్వాల్ రైల్వేస్టేషన్‌లో దిగలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం కుటుంబ సభ్యులు కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు 8712658584కు ఫోన్ చేయాలని సీఐ కోరారు.

వైద్యుల నిర్లక్ష్యంతో యువకుడి మృతి

● ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

రాంనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల ఓ యువకుడు మృతి చెందాడని అతని బంధువులు శుక్రవారం ఆస్పత్రి ముందు ఆందోళన చేపట్టారు. ఓయూ మాణికేశ్వరినగర్‌కు చెందిన గండికోట వేణుగోపాల్ (27) ఈ నెల 22న కడుపునొప్పి, గ్యాస్ ట్రబుల్ సమస్యతో దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రిలో చేరాడు. గురువారం సాయంత్రం వరకు బాగానే ఉన్న అతను రాత్రి అకస్మాత్తుగా మృతి చెందాడని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే వేణుగోపాల్ మృతి చెందాడని అతని బంధువులు ఆందోళనకు దిగారు. వేణుగోపాల్ కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

అంబర్‌పేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అక్రమ సంబంధం కారణంగా కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌అంబర్‌పేట బతుకమ్మకుంటకు చెందిన ఉమ్మనేని గోపికుమార్ (35)కు భార్య లక్ష్మీదుర్గ, కుమారుడు కుమార్తె ఉన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం అతనికి స్వప్నతో అక్రమ సంబంధం ఏర్పడింది. ఈ విషయం గోపి ఇంట్లో తెలియంతో అతని కుటుంబంలో గొడవలు జరిగాయి. లక్ష్మీదుర్గ తన తల్లిగారింటికి వెళ్లింది. భర్తను వదిలేస్తా.. తనను వివాహం చేసుకోవాలని స్వప్న గోపిని ఒత్తిడి చేసింది. అయితే, కొద్ది రోజులుగా స్వప్న గోపిని దూరం పెట్టడమే కాకుండా తన సోదరుడు సాయితో కలిసి గోపిని కొట్టించిందని సమాచారం. ఈ నెల 23న పద్మావతి తన కుమారుడు గోపి ఇంటికి వెళ్లి కలవగా అతడు సినిమాకి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం గోపి సోదరి శారద తన తల్లి పద్మావతికి ఫోన్ చేసి లక్ష్మీదుర్గ తన తల్లి ఇంటికి వెళ్లిందని ఫోన్‌లో చెప్పింది. గోపి హయత్‌నగర్‌లోని అత్తగారింటికి వెళ్లి లక్ష్మీదుర్గను పంపమని అడగగా.. పెద్ద మనుషులతో మాట్లాడిన అనంతరం పంపిస్తామన్నారు. ఈ విషయంపై తన తల్లితో గోపి గొడవపడ్డాడు. దీంతో ఆమె సమీపంలో ఉండే తన కూతురు శారద ఇంటికి వెళ్లింది. తరువాత వచ్చి చూడగా.. గోపి తన బెడ్‌రూమ్ ఉరేసుకొని మృతి చెందాడు. అంబర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.